

విజయనగరంలో పని పూర్తిచేసుకొని బస్ స్టాండుకి వెళ్ళాను. ఆ రోజు సంతట. తెలియక ఈ వేళే పని కట్టుకుని వచ్చాను. బస్సు దొరుకుతుందో లేదో అనుకుంటూంటే బస్సొచ్చింది. ఈగల్లా ముసిరారు మనుషులు. అతి కష్టం మీద బస్సెక్కి సీటు సంపాదించాను.

నా వెనక సీట్లో ఎవరో ఆడమనిషి కూర్చుంది. పని పిట్టలా అరుస్తోంది.

"ఏటమ్మా ... కూసింత జరుగూ. నా నెత్తిమీద కూకుంటే ఎట్టా ..." పక్కన కూర్చున్న మరో ఆడ మనిషిని ఒక చేత్తో నెడుతూ అంది. రెండో చేత్తో కోడి పెట్టని పట్టుకుంది.

"ఏటే నర్సమ్మా... నువ్వు ఇజీనగరం వచ్చేవేంటి ... ఏటి సంగతి?" ఇంకో ఆడమనిషిని పలకరించింది కోడి పెట్టని పట్టుకున్న మనిషి.

"నువ్వేటే అప్పలకొండా...నువ్వెందుకొచ్చావ్?

"ఆ ... కూకో ... కూసింత జరుగమ్మా ... మన్లో మనం సరుదుకోవాల ... ఊఁ ... జరుగూ ..." మరి కాస్త తోసి, నర్సమ్మకి జాగా ఇచ్చింది అప్పల కొండ.

పిప్పళ్ళ బస్తాలా కూరుకుపోయింది నర్సమ్మ. అప్పల కొండ చేతిలో కోడి పెట్ట గాలాడక 'కొక్కొరుకో' అంటూ గోల పెట్టింది.

'ఊరుకోయే ... నంజికానా ...' దాన్నెత్తిమీద మొటికె జెల్ల తగిలించి, దాని కాలికి ఉన్న పురి కొసతాడు తన కాలి బొటనవేలికి కట్టుకుని సీటుకింద పెట్టింది.

కోడి పెట్ట గువ్వ పిట్టలాకూర్చుంది.

"ఊఁ ఇప్పుడు సెప్పు ... ఏటిలా గొచ్చావ్? ఏమిటి?" చెంగుతో మొహం తుడుచుకుంటూ అడిగింది అప్పలకొండ.

"ఏటుంది ... మా కుర్రదాన్ని సూసిపోదామని ... మొన్న పండక్కి రమ్మని ఉత్తరం ముక్క రాయించినాను. రానేదు. ఏంటైందోనని నానే సూసిపోదామని ఎల్లొచ్చాను." నర్సమ్మ రొప్పుతూ చెప్పింది.

అంతవరకూ వెనక్కి తిరిగిచూస్తున్న నాకు మెడనొప్పి పుట్టింది. సరిగా తిరిగి కూర్చున్నాను. బస్సు బయలుదేరింది. వాళ్ళ మాటలు వినిపిస్తున్నాయి.

"పండక్కెందుకు రానేదటా? మళ్ళీ అప్పలకొండే అడిగింది.

అప్పలకొండ గొంతు కీచుగొంతు. నర్సమ్మది మనిషిలాగే బొంగురు గొంతు.

"నిరుడు ఏటో ఉద్యోగమని ... ఈ పాలి కోపమొచ్చి అల్లుడుగారు ఎల్లా

